సాక్షి మంచిర్యాల

మంగళవారం ı 28 ı నవంబర్ ı 2023



హమ్మయ్య.. పులి క్షేమం 6లో▸

వారం రోజులుగా జాడలేని కే–12 పులి ఆచూకి ఏట్టకేలకు లభ్యమైంది. రెబ్బెన రేంజ్ రాంపూర్ అటవీ బీట్, మొండిగుట్ట ప్రాంతంలో పులి క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు.



పోలింగ్ ప్రక్రియ ఇలా..

ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు అత్యంత కీలకం. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ నిర్వహణపై ప్రత్యేక కథనం... 6లో▸

గరిష్టం/కనిష్టం
31.1 /21.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి చలిగా ఉంటుంది.

అమిత్.. 'షో'!



అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న రఘునాథ్‌రావు



అభివాదం చేస్తున్న అమిత్‌షా

- జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగిన మంచిర్యాల పట్టణం
- భారీ బందోబస్తు నడుమ సకలజనుల విజయ సంకల్ప యాత్ర
- హోం మంత్రిపై పూలవర్షం కురిపించిన బీజేపీ అభిమానులు



రోడ్‌షోలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బీజేపీ మంచిర్యాల అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి తరఫున సోమవారం రోడ్‌షో నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో కలెక్టరేట్ ఆవరణలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న అమిత్‌షా.. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో మంచిర్యాల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక రథంలో 3:15 గంటలకు రోడ్‌షో ప్రారంభించారు. శ్రీనివాస్ టాకీస్ రోడ్ మీదుగా ముఖరాం చౌరస్తా, అర్చన టెక్స్ చౌరస్తాకు 4:30 గంటలకు చేరుకుంది. దారిపొడవునా బీజేపీ శ్రేణులు, అభిమానులు అమిత్‌షాపై పూల వర్షం కురిపించారు. జైశ్రీరాం నినాదాలతో మంచిర్యాల పట్టణం మార్మోగింది. రోడ్ షోలో గిరిజనుల గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో అమిత్‌షా మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి రాగానే సింగరేణి కార్మికుల ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేస్తామని, ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునాథ్‌ను గెలిపించాలని కోరారు.



పూల వర్షం కురిపిస్తున్న బీజేపీ అభిమానులు

ప్రత్యేక బలగాలతో బందోబస్తు...

అమిత్‌షా రోడ్‌షోకు 24 గంటల ముందు నుంచే జిల్లా కేంద్రంలో ప్రత్యేక బలగాలు సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ప్రత్యేక కమాండోలు, స్థానిక సిబ్బంది 300 మందితో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అమిత్‌షా దారి పొడవునా అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

జనవరి నుంచి కొత్త పథకాలు

- కాళేశ్వరం బ్యాక్‌వాటర్ సమస్య పరిష్కరిస్తాం
- కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో ఆలోచించండి
- కాంగ్రెస్‌లోకి వెళ్లినవారి సంగతి డిసెంబర్ 3 తర్వాత చూస్తాం
- చెన్నూరు రోడ్‌షోలో మంత్రి కేటీఆర్



చెన్నూర్‌లో ప్రచార రథంపై రుమాలు ఊపుతూ కార్యకర్తల్లో జోష్ నింపుతున్న కేటీఆర్, సుమన్

చెన్నూర్: 'తెలంగాణలో జనవరి నుంచి కొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. పింఛన్లు పెంచుతాం, కొత్త రేషన్‌కార్డు జారీ చేస్తాం, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తాం.. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా అమలు చేస్తాం. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలనెలా రూ.3 వేలు ఇస్తాం' అని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ తరఫున చెన్నూర్ పట్టణంలో సోమవారం రోడ్‌షో నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో కేటీఆర్ మాట్లాడారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక కష్టాలు పడ్డామని, మళ్లీ కరెంటు కష్టాలు కావాలో, 24 గంటల కరెంటు కావాలో ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలని సూచించారు. రైతుల మేలు చేసేందుకు రైతుబంధు ఇవ్వాలని ఎన్నికల సంఘానికి కేసీఆర్ లేఖ రాశారని తెలిపారు. ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే రేవంత్‌రెడ్డి అడ్డుకున్నారని, రైతుల నోటికాడి ముద్ద లాక్కున్నారని ఆరోపించారు.

బీజేపీకి ఓటేస్తే మోరీలో వేసినట్లే ..

ప్రధాని నరేంద్రమోదీ జన్‌ధన్ ఖాతాలు తెరవండి ఖాతాల్లో రూ.15 లక్షలు ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200లకు పెంచారని తెలిపారు. ప్రస్తుతం చెన్నూర్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గతంలో బీజేపీలోనే ఉన్నారన్నారు. బీజేపీ ఓటేస్తే మురికి కాలువలో వేసినట్లే అని ఎద్దేవా చేశారు.

డిసెంబర్ 3 తర్వత వాళ్ల సంగతి చెప్తాం..

'కొందరు డబ్బులకు ఆశపడి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. కొందరు కాంగ్రెస్ నాయకులు డబ్బు ఉందని బలిసి కొట్టుకుంటున్నారు. ఇలాంటి వారు పక్కాగా యాది ఉంచుకోండి. డిసెంబర్ 3 తర్వత మీ సంగతి చూస్తం' అని కేటీఆర్ హెచ్చరించారు. కొందరు పేపర్, ఛానెల్ పెట్టి, పైసలు ఎక్కువై సంచులు పట్టుకొని వచ్చారని ఆరోపించారు. ఓటుకు రూ.10 వేలు ఇచ్చి ప్రమాణం చేయిస్తారని, పైసలు తీసుకొని బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు.

సుమన్ మా కుటుంబంలో సభ్యుడు..

తమ్ముడు సుమన్ కేసీఆర్ కుటుంబంలో సభ్యుడని కేటీఆర్ అన్నారు. గెలిచిన ఐదేళ్లలో రెండేళ్లు కరోనాతో కాలం గడిచింది. మూడేళ్లలో జిల్లాలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి చేశాడని పేర్కొన్నారు. పక్క నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చెన్నూర్ అభివృద్ధిని చూసి సరాజుగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెసోడు గెలిస్తే ఇక్కడ ఉండడని, చెన్నూర్‌లో గెలిచేది సుమనే, ఇక్కడ ఉండేది సుమనేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి సుమన్ చేతిలో ఓడిపోయి, రాజకీయ భవిష్యత్తు భూస్థాపితం చేసుకోవాలని రాసిపెట్టి ఉందన్నారు. రోడ్డుషోలో పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేత, టీబీజీకేఎస్ అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే సంజీవరావు, సరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

బ్యాక్‌వాటర్ సమస్య పరిష్కరిస్తాం..

ఈ ప్రాంత రైతులు ఎందుర్కొంటున్న కాళేశ్వరం బ్యాక్‌వాటర్ సమస్యను బాల్క సుమన్ తన దృష్టికి తెచ్చారని, మళ్లీ అధికారంలోకి రాగానే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. అవసరమైతే రైతులకు పరిహారం ఇస్తామని, పంటలు మునిగిపోకుండా కరకట్ట నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

న్యూస్‌రీల్

కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాలో ఈనెల 28 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా తిరగొద్దని సూచించారు. రాజకీయ పార్టీల జెండాలు, ప్లకార్డులు, గుర్తులు ధరించొద్దని పేర్కొన్నారు. మైకులు, డీజే, లౌడ్ స్పీకర్లు, రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వకూడదని వివరించారు. ధర్నాలు, సంబురాలు, ర్యాలీలు, టపాసులు కాల్చడం చేయవద్దని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

29, 30 తేదీల్లో పత్తి కొనుగోళ్లు బంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఈనెల 29 ,30 తేదీల్లో పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ మండలం రేపల్లెవాడ శివారులోని రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ దృష్ట్యా రెండు రోజులు కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ అందరికీ ఇవ్వాలి

మంచిర్యాలఅర్బన్: ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శంకర్‌గౌడ్ కోరారు. ఈసీ అందరికీ ఆ హక్కు కల్పించాలని పేర్కొన్నారు. పోలింగ్ విధులు ముగించుకుని సొంత ప్రాంతాలకు చేరేవరకు రాత్రి అవుతున్నందున పోలింగ్ సిబ్బందికి డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు మంజూరు చే యాలని కోరారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి మెరుగైన భోజనం, వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆఖరి మోఖా!

- నేటి సాయంత్రం 5 గంటలకు ముగియనున్న ఎన్నికల ప్రచారం
- చివరి రోజు హోరెత్తించేలా అభ్యర్థులు ప్లాన్..
- అంతర్గతంగా పోల్ 'మేనేజ్‌మెంట్'పై నేతల దృష్టి
- భారీగా మద్యం డంప్, ప్రలోభాలకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరింది. ఆఖరి రోజు ప్రచారాన్ని మరింత హోరెత్తించేందుకు అభ్యర్థులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారం నిలిపివేయాలి. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం 5 గంటల వరకే ప్రచారం ఆపివేయాలి. అంతేకాక నియోజకవర్గంలోని స్థానికేతరులు వెళ్లిపోవాలి. 144 సెక్షన్ అమలులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో చివరి రోజును వీలైనంత ఎక్కువగా సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా రోడ్ షోలు, అగ్రనేతల సుడిగాలి పర్యటనలతో జిల్లాలో ప్రధాన పార్టీల ప్రచారం హోరెత్తుతోంది. ఇక ఇప్పటికే ఓదఫా ప్రచారం ముగించిన అభ్యర్థులు ఇంకా ఎక్కడైనా మిగిలి ఉంటే పూర్తి చేసుకుంటున్నారు. తమకు మద్దతు తెలిపే ప్రాంతాలు, వర్గాలను కలుస్తూ తమకే ఓటెయ్యాలని వేడుకుంటున్నారు. కుటుంబ సభ్యులను సైతం ప్రచారంలోకి దింపి వేకువజాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జనం మధ్యనే ఉంటున్నారు. నిద్రాహారాలు మాని సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వరకు ప్రచార రథాలు, రోడ్‌షోలు, పట్టణాల్లో విస్తృతంగా తిరిగేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

మిగిలింది పోల్ మేనేజ్‌మెంటే..

ప్రతీ అభ్యర్థి గెలుపోటముల్లో చివరి రెండు రోజులే కీలకంగా ఉంటాయి. ఎన్నికల ప్రక్రియలో పోల్ మేనేజ్‌మెంట్‌తోనే అభ్యర్థుల భవితవ్యం ముడిపడి ఉంటుంది. ఇప్పటికే అభ్యర్థులు బూత్‌స్థాయి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రతీ బూత్‌స్థాయిలో ఇద్దరు, ముగ్గురేసి ఇన్‌చార్జీలను నియమించి, నగదు, మద్యం పంపిణీకి ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో నమ్మకస్తుల వద్దకు డబ్బుల సంచులు చేరుకున్నాయి. మద్యం దుకాణాలు ఈ నెల 28, 29, 30 బంద్ ఉండడంతో మూడు రోజుల క్రితమే సరకును రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకున్నారు. రాత్రి వేళ స్థానిక నాయకుల ఇళ్లకు చేరి మందుబాబులు మద్యం తీసుకెళ్తున్నారు. ఇంటికో సీసా, ముందస్తు చెల్లింపుల కింద కొంత మొత్తం ఓ పార్టీ ఇస్తున్నట్లు సమాచారం జరుగుతోంది. ప్రత్యర్థి పార్టీ మళ్లీ ఎంత ఇస్తుందో చూసి మరో దశలో ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా రెండు నియోజకవర్గాల్లో ఆ మేరకు ఏర్పాట్లు జరిగాయి. ఈ క్రమంలో వలస ఓటర్లకు ముందుగానే ఫోన్‌పే, గూగుల్ పేలతో చెల్లించడం, పోల్ చిట్టీలు ఇచ్చేప్పుడే ఒక్కో ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి? ఆ ఓట్లు ఎటు వేసే అవకాశం ఉందని తెలుసుకుని ప్రలోభాల పర్వం మొదలు పెడుతున్నారు. మరోవైపు ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటేసేందుకు ఎన్నికల సంఘం ఎక్కడిక్కడ నిఘా ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టులు, పోలీసు బందోబస్తు, ప్రత్యేక బలగాలతో గస్తీ కాస్తోంది. ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా తక్షణం స్పందించి చర్యలు తీసుకునేలా అప్రమత్తంగా ఉంది.



ప్రత్యర్థిపైనే కన్ను..

బరిలో ఉన్న అభ్యర్థుల ఓ కన్ను ఓటర్లపై ఉంటే మరో కన్ను తమ ప్రత్యర్థిపై పెట్టి వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో అవతలి వాళ్లు ఏ వర్గాన్ని మచ్చిక చేసుకుంటున్నారు? ఎలాంటి ప్రలోభాలకు గురిచేస్తున్నా రు? వాడలు, కాలనీలు, గ్రామాలు, పట్టణా ల్లో ఎక్కడిక్కడ ఆరా తీస్తున్నారు. తమ అనుచరులతో ప్రత్యర్థివర్గం చేస్తున్న ప్రణాళికలను పసిగడుతూ అంతకుమించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడైనా అభ్యర్థుల డబ్బు, మద్యం, బ హుమతులు దొరికితే పట్టించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు

- పోలింగ్‌కు అంతాసిద్ధం చేయాలి
- ఎన్నికల పరిశీలకుడు అజయ్‌వినాయక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మూడు నియోజవకర్గాల్లో ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా, పకడ్బందీగా నిర్వహించాని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు అజయ్‌వినాయక్, ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్‌దత్తా, సజ్జనార్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, పోలీస్ పరిశీలకులు ఆర్.ఇలంగో, రామగుండ సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, బెల్లంపల్లి ఆర్వో, అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఆర్వో రాములు, చెన్నూర్ ఆర్వో సిడా దత్తుతో కలిసి ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బెల్లంపల్లి బజార్ ఏరియాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల నిర్వహణకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 10 స్టాటిక్ సర్వేలెన్స్, 4 వీడియో సర్వేలెన్స్, 3 వీడియో పరిశీలన, 4 సహాయ ఖర్చుల పరిశీలకులు, 3 కౌంటింగ్ బృందాలు, 1 ఎంసీఎంసీ, 1 కంట్రోల్ రూమ్, 1 జిల్లా ఖర్చుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అదనపు సిబ్బందితో కలిసి 97 సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

ఖర్చుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి

- ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సీఎస్ పవన్



రికార్డులు పరిశీలిస్తున్న పవన్

మంచిర్యాలఅగ్రికల్చర్: అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సీఎస్.పవన్ అన్నారు. మంచిర్యాల నియోజవర్గ పరిధిలోని రిటర్నింగ్ అధి కారి కార్యాలయంలో ఎన్నికల ఖర్చుల రికార్డులను సోమవారం పరిశీలించారు. ఖర్చుల వివరాలు తేడాలు ఉంటే సంబంధిత అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజేశ్వరి, నరేశ్, అకౌంటింగ్ టీం నాగరాజు, కిషన్, జి.నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 159 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 4 గంటల వరకు క్యూలో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం
- మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగింపు
- మూడు రోజులు మద్యం దుకాణాలు మూసివేత
- స్థానికేతరులు వెళ్లిపోవాలి..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సంతోష్, సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాల అగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 30న నిర్వహించే పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో 159 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని తెలిపారు. జిల్లాలో ఓటింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకని తెలిపారు. ఈ సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటువేసే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. భారీగా క్యూలో ఉంటే రాత్రి వరకు అయిన ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి ఐదు మహిళా కేంద్రాలు, ఐదు మోడల్ కేంద్రాలు, ఐదు యూత్, ఒక దివ్యాంగుల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇంటి నుంచి ఓటు వేసేందుకు 357 మంది దరఖాస్తు చేసుకోగా 331 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, ర్యాంపు, వీల్‌చైర్స్, వలంటీర్లను అందుబాటులో ఉంచామని వివరించారు. ఎన్నికల సిబ్బంది ఒక రోజు ముందుగానే పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని తెలిపారు. ప్రతీది వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. వెబ్‌కాస్టింగ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి సాయంత్రంతో ప్రచారం నిలిపివేత..

ఓటింగ్ సమయానికి 48 గంటల ముందే అభ్యర్థులు ప్రచారం ముగించాలని, మద్యం దుకాణాలు సైతం మూసి ఉంచాలని తెలిపారు. స్థానికంగా ఓటరు కానివారు నియోజకవర్గం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. నగదు, మద్యం, ఇతరత్రా గిఫ్ట్ ఐటమ్స్‌తో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వారిపై నిఘా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు నేరచరిత్ర ఉన్న, గతంలో ఎన్నికల సమయంలో హింసకు పాల్పడిన 114 మంది, 65 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామని వివరించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యంతోపాటు రూట్‌మ్యాప్ ఇప్పటికే సిద్ధం చేశామని తెలిపారు.

కార్తీక శోభ



హాజీపూర్ మండలం ముల్కల్ల గోదావరి తీరాన శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ముల్కల్ల గోదావరి ఒడ్డున భక్తుల పూజలు



మంచిర్యాల విశ్వనాథాలయంలో..



గూడెంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మంచిర్యాల విశ్వనాథస్వామిఆలయం, కోదండరామాలయం, గౌతమేశ్వర ఆలయాలకు వేకువ జామునుంచే భక్తులు తరలివచ్చారు. ఆలయాల ఆవరణలోనే దీపాలు వెలిగించి పూజలు చేశారు. ముల్కల్ల గోదావరి పుష్కర ఘాట్‌కు వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నదిలో దీపాలు వదిలారు. శివుడికి అభిషేకాలు చేశారు. ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. - మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి

క్లుప్తంగా

నగదు పట్టివేత

దహెగాం: మండలంలోని కల్వాడ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిరంతరం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆదివారం రాత్రి నగదును పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. జనగామ జిల్లాకు చెందిన చిట్టూరి చిదంబరం అనే వ్యక్తి బొలెరో వాహనంలో కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో తనిఖీ చేయగా రూ.70వేల నగదును పట్టుకున్నారు. వాటికి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

సూర్యనగర్‌లో దొంగతనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సూర్యనగర్‌లో నివాసం ఉంటున్న కనగర్తి సంతోష్‌కుమార్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్ స్థానిక ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల26న సాయంత్రం వరంగల్ జిల్లా నర్సంపేటలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులను అక్కడే వదిలేసి అదే రాత్రి ఒంటి గంటకు ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చే సరికి వాహనం చప్పుడు విన్న దొంగ ఇంటి వెనుకలోని డోర్ తీసుకొని పారిపోవడాన్ని సంతోష్ గమనించాడు. వెంటనే 100కు కాల్ చేసి సమాచారం అందించాడు. ఇంట్లోని బీరువాలోని రూ.15వేలు నగదు, 20తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగ్


నర్సింగ్

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా జంజుపల్లి నరసింగ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ యూనియన్ జాతీయ కార్యదర్శి బి.జనక్‌ప్రసాద్ ఆదేశాల మేరకు నర్సింగ్‌కు జిల్లా ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టినట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ్ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి యువజన ప్రజా పోరాటాల్లో పనిచేసిన అనుభవం ఉండడంతో నర్సింగ్‌కు జిల్లా కమిటీలో స్థానం కల్పించినట్లు ఆయన తెలిపారు.

నేడు జోనల్‌స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం అండర్ 14, 17 విభాగంలో బాలికల జోనల్‌స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వచ్చే క్రీడాకారులు ఉదయం 9 గంటలలోగా రిపోర్ట్ చేయాలని, మరిన్ని వివరాలకు 80080 90626, 94400 10453 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మద్యం పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు భీంపూర్ వద్ద సిబ్బందితో కలిసి ఎస్సై తనిఖీలు నిర్వహించారు. భీంపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అరవింద్, రాథోడ్ గణేష్ అనే వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 180 ఎంఎల్ కలిగిన 192 మద్యం బాటిళ్లను గుర్తించారు. మద్యాన్ని సీజ్ చేశారు.

పోలింగ్ ప్రక్రియ ఇలా..

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు అత్యంత కీలకం. అయితే ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈవీఎంల తరలింపు మొదలుకొని ఓటింగ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుంది. ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద గల స్ట్రాంగ్ రూములకు తరలించే వరకు కొనసాగే ప్రక్రియ, పోలింగ్ అధికారుల విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు, తదితర అంశాలపై సాక్షి ప్రత్యేక కథనం...

- ఎన్నికల సిబ్బంది విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు
- పోలింగ్ మొదలుకొని కౌంటింగ్ కేంద్రాల వరకు
- వివిధ దశల్లో అనుక్షణం అప్రమత్తం
- సమన్వయంతోనే సజావుగా పూర్తి..



ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే రెండు విడుతలుగా శిక్షణ పూర్తయింది. అయితే పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలు ఎన్నికల రోజు ఆయా రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు పాత్ర కీలకంగా ఉంటుంది..

ఈ నెల 29న పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించబడిన పోలింగ్ సిబ్బంది ఒక్కో కేంద్రానికి నలుగురు ఒకరోజు ముందే నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల వద్ద నుండి ఎన్నికల సామగ్రిని స్వీకరించి సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

మాక్ పోలింగ్ తో మొదలు...

ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎం యంత్రాలతో పాటు సిబ్బంది 29నే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. పోలింగ్ రోజు ఉదయం 5:30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున వచ్చిన పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6:30 లోపే మాక్ పోలింగ్ ప్రక్రియను ముగించాలి. మాక్ పోలింగ్‌లో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓట్లు వేసి పరిశీలించాల్సి ఉంటుంది. అన్నిసరిగానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వారి సమక్షంలో ఈ యంత్రాలను క్లియర్ చేసి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.

పోలింగ్ ఏజెంట్ల పాత్ర ..

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్‌కేంద్రాలలో రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటరు నిజమైన వ్యక్తి లేదా బోగస్ ఓటరా అని పోలింగ్ ఏజెంట్లు నిశితంగా పరిశీలిస్తారు. పోలింగ్ కేంద్రంలో ప్రతి అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. అందులో ఒక్కరు మాత్రమే కూర్చోడానికి అవకాశం ఉంటుంది. పోలింగ్ ఏజెంట్లు ఫారం 10లో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ నియామక పత్రం పొందిన వారికి ఏజెంట్ పాసును జారీ చేస్తారు. ఓటరు జాబితాను బయటకు తీసుకు వెళ్లేందుకు వీలు ఉండదు పోలింగ్ ఏజెంట్లు స్థానికుడై ఉండి ఎన్నికల కమిషన్ అనుమతించిన ఫొటో గుర్తింపు కార్డును కలిగి ఉండాలి.

రెండుగంటలకొసారి పోలింగ్ శాతం..

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు ఓసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా వెల్లడిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 17-ఏ రిజిస్టర్లో నమోదైన ఓట్లు, ఓటర్ స్లిప్పులు, కంట్రోల్ యూనిట్లలో గల మొత్తం నమోదైన ఓట్లు ఏకీభవించాలి. అప్పుడే పోలింగ్ శాతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపుతారు. సెక్టారు అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారాన్ని అందిస్తారు.

పోలింగ్ అధికారుల విధులు ఇలా...

ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందిదే బాధ్యత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి మరో ఇద్దరు ఇతర ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఉంటారు. పోలింగ్ కేంద్రం మొత్తం బాధ్యతను ప్రిసైడింగ్ అధికారి పర్యవేక్షిస్తారు.

పోలింగ్ ముగింపు...

పోలింగ్ సమయం ఐదు గంటలకు ముగుస్తుండగా 15నిమిషాల ముందే వెల్లడించాల్సి ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు వేయటానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు 17-ఏ లో గల మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు సరిపోలతో ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

ఆదిలాబాద్ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు
ఆదిలాబాద్: 290, బోథ్: 302
మొత్తం: 592

నిర్మల్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలు	
ఖానాపూర్: 305	
నిర్మల్: 306	ముధోల్: 311
మొత్తం: 922	

మంచిర్యాల జిల్లాలో	
మంచిర్యాల: 289	
చెన్నూర్: 227	బెల్లంపల్లి: 227
మొత్తం: 743	

ఆసిఫాబాద్‌లో జిల్లాలో..
ఆసిఫాబాద్: 305, సిర్పూర్: 294
మొత్తం: 599

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా...

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల్లో పంపిణీ కేంద్రాలకు చేరుస్తారు. ఆ మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలవద్దగల స్ట్రాంగ్ రూంలోనికి తరలిస్తారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


గగన్‌దీప్ మృతదేహం

కౌటాల: కళ్ల ఎదుటే ఆరోగ్యంగా ఆడుకుంటున్న బాలుడు గంటల్లోనే మృతి చెందాడు. గాయంతో ఆస్పత్రికి బాలుడిని తీసుకెళ్లిన తల్లిదండ్రులు శవంతో ఇంటికి చేరుకున్న విషాద ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాకు చెందిన చిన్నారి గగన్‌దీప్(11 నెలలు)కు సోమవారం ఇంటి వద్ద చేతి చిటికెన వేలికి గాయమైంది. దీంతో తల్లిదండ్రులు మల్యాల రాజశేఖర్, మానికలు స్థానిక విజేత ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యుడు రఘుపతి చికిత్స అందించాడు. టీటీ ఇంజక్షన్ వేయాలని నర్సుకు సూచించి మందులు సూచించాడు. చికిత్స అనంతరం బాలుడిని ఇంటికి తీసుకువెళ్లారు. వైద్యుడు సూచించిన మందులు తాగించగా బాలుడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. నోటి నుంచి నురుగులు రావడంతో బాలుడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌కు తరలించాలని సిబ్బంది సూచించారు. దీంతో బాలుడిని అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. ఆసుపత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సిబ్బంది ఆసుపత్రి నుంచి పారిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులను సముదాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ సాదిక్‌పాషా, ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పారు. అయినప్పటికీ అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది.

కేసీఆర్‌తోనే సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు సీఎం కేసీఆర్ ద్వారా తిరిగి అమల్లోకి వచ్చాయని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ అన్నారు. సోమవారం ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రత్యేక చొరవతో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు దక్కాయన్నారు. లాభాల్లో వాటా పెంపుతో పాటు జాతీయ కార్మిక సంఘాలతో సింగరేణి కార్మికులు కోల్పోయిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల ద్వారా తిరిగి కార్మికులకు అందించిన ఘనత కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. సింగరేణి కార్మికులను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్న కేసీఆర్ రుణం తీర్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. బెల్లంపల్లి ఏరియా పరిధిలోని ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల బీఆర్‌ఎస్ అభ్యర్థులు కోవలక్ష్మి, దుర్గం చిన్నయ్యలను గెలిపించుకోవాల్సిన బాధ్యత యూనియన్‌తో పాటు ఏరియాలో పని చేసే సింగరేణి కార్మికులపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ తోనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని వివరించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారం లోకి వస్తే సింగరేణి ప్రైవేటు పరం కావటం ఖాయమన్నారు. అనంతరం యూనియన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోవలక్ష్మికి మద్దతుగా గోలేటి టౌన్‌షిప్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు,చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్ని అధికారులతో పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్ ఆర్వోలు అదనపు కలెక్టర్ రాహుల్, రాములు, దత్తు పాల్గొన్నారు.

అఖరి 72గంటలు ప్రత్యేక బృందాల నిఘా

పోలింగ్ ముందు నుంచి చివరి వరకు అఖరి 72 గంటలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన ఇతర అన్ని ప్రత్యేక బృందాల ద్వారా నిఘా పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఓట్లకు మద్యం, నగదు, కానుకల పంపిణీ ద్వారా ప్రలోభాలకు గురిచేయరాదని, పోలింగ్ 48 గంటల ముందుగానే ప్రచార కార్యక్రమాలు నిలిపివేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా అధిక మొత్తంలో నగదు తరలింపు, బదిలీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఒక్క వాహనంలో 5 మందికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ఎలాంటి ప్రచారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, 200 మీటర్ల దాటిన తరువాత ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇందులో అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సులు

ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30న పోలింగ్ కోసం చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కోసం ఆయా అసెంబ్లీ స్థానాలలో పంపిణీ కేంద్రాలకు బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఎన్నికల సిబ్బందికి ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఎన్నికల సిబ్బంది ఈ నెల 29న ఉదయం 9 గంటలకు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని, 30న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి పంపిణీ కేంద్రాల నుంచి బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

మూడు నియోజకవర్గాలకు బస్సులు..

చెన్నూర్ నియోజకవర్గాని చేరుకోవడానికి జన్నారం ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 7.30 గంటలకు బయలుదేరి దండేపల్లి బస్‌స్టాప్, ఉత్కూర్, చౌరస్తా, లక్షెట్టిపేట మీదుగా, బెల్లంపల్లి తిలక్ స్టేడియం నుంచి ఉదయం 7.30 గంటలకు మందమర్రి పాత బస్టాండ్ మీదుగా, మంచిర్యాల బస్టాండ్ నుంచి ఉదయం 8 గంటలకు సీసీసీ ఎక్స్‌రోడ్ బస్‌స్టాప్, జైపూర్ బస్‌స్టాప్, భీమారం బస్‌స్టాప్‌ల మీదుగా బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆరబోస్తూ..కుప్ప చేస్తూ


పెద్దంపేటలో కవర్లు కప్పుతున్న రైతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్) /దండేపల్లి: రెండు రోజులుగా వర్షం భయంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికే అకాల వర్షంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కొంత తడిసిపోయగా మరికొంత మంది ముందస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని రైతులు ఓ వైపు ఆరబెట్టుకుంటుండగా మరికొంత మంది రైతులు ధాన్యం తడిసి పోకుండా భద్రంగా కవర్లు కప్పుకుంటున్న దృశ్యాలు సోమవారం హాజీపూర్ మండలం పెద్దంపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో చోటు చేసుకున్నాయి.


పెద్దంపేటలో ధాన్యం ఆరబెడుతూ..

ఓటర్ల చెంతకు డబ్బు, మద్యం..!

- మద్యం, డబ్బు పంపిణీపైనే ఆశలు
- ఓటరు పొలిమేరల్లో సర్దిపెట్టుకున్న వైనం
- ప్రత్యర్థి అభ్యర్థి సైతం అదే బాటలో
- ఈసారి తడాఖా చూపుతామంటున్న ఓటర్లు

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగియడానికి మరో 12గంటల సమయం మాత్రమే మిగిలి ఉండగా పోటీలో నిలిచిన ప్రధాన పార్టీలు సర్వం సిద్ధం చేసుకున్నాయి. ఆఖరు దశలో ఓటర్లను కొనుగోలు చేయడానికి సరిపడినంతగా డబ్బు, ప్రలోభాలకు గురి చేయడానికి మద్యం సమకూర్చుకుని పంపిణీ పర్వానికి తెర తీయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి తీవ్రమైనపోటీ కనిపిస్తోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పక్షాల అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొనగా మిగతా పార్టీలైన బీజేపీ, బీఎస్పీ ఇతర స్వతంత్ర అభ్యర్థులు తమదైన రీతిలో పోటీని ఇస్తున్నారు. రెండు ప్రధాన పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా జరుగుతుండటంతో విజయం సాధించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు సంబంధించి ఓటర్లను బుట్టలో వేసుకోవడానికి శక్తి యుక్తులను సమకూర్చుకుని అదునుకోసం కాచుకు కూర్చున్నట్లు తెలుస్తోంది.

ముందస్తుగానే సర్దుకుని...

ప్రచార పర్వం ముగిసేలోగానే పోటీలో ఉన్న ఓ అభ్యర్థి అందరి కన్న ముందస్తుగానే అంచనా ప్రకారం మందు, డబ్బులు నిర్దేశించిన రహస్య ప్రాంతాలకు సరఫరా చేసినట్లుగా లోకం కోడై కూస్తోంది. ఎన్నికల అధికారుల పర్యవేక్షణ, పోలీసు నిఘా తీవ్రతరం కాకముందే మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో చేరవేత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లుగా సదరు అభ్యర్థి పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఇతర అభ్యర్థుల అంచనాకు చిక్కకుండా ఎక్కడి కక్కడ సర్దుబాటు చేసినట్లు ప్రచారం సాగుతుండగా, ప్రధాన ప్రత్యర్థి అయిన మరో రాజకీయ పార్టీ అభ్యర్థి ఇప్పుడిప్పుడే ఏర్పాట్లలో తలమునకలైనట్లుగా తెలుస్తోంది. పోలీసు నిఘా పెరగడంతో ఓటర్లకు పంపిణీ సామగ్రి ఎంతవరకు సేఫ్‌గా చేరుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా ఎంత నిఘా ఉన్నా సరే ప్రత్యర్థి అభ్యర్థికి ధీటుగా ఆఖరి అస్త్రాలను సంధిస్తామనే ధీమాను వ్యక్తం చేస్తున్నట్లుగా శ్రేణులు పేర్కొంటున్నారు. ఆ ప్రకారంగా ఇరువురు ప్రధాన ప్రత్యర్థులు ఎందులోనూ తగ్గకుండా అన్నింటిలోనూ సమ ఉజ్జీగా దూసుకుపోతుండడంతో ఓటర్లు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

ప్రజల నిరసనలు, నిలదీతలతో...

ఎన్నికల ప్రచారంలో ఈసారి ఓ ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థికి ఓటర్లు చుక్కలు చూపిస్తున్నారు. గ్రామాలకు వెళ్లకుండా పొలిమేరల్లో అడ్డుకుని అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నారు. సమస్యలు పరిష్కరించకుండా మళ్లీ ఓట్లకు వచ్చారా అని మొఖం మీదనే ఓటర్లు తెగేసీ అడుగుతున్నారు. ఈసారి మాత్రం ఓటర్ల తడాఖాను చవిచూస్తున్నారు. సామాన్య ఓటర్లతో పాటు సొంత సామాజిక వర్గం నుంచి వ్యతిరేకతను సదరు అభ్యర్థి ఎదుర్కొంటుండటం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సర్వత్రా చర్చనీయాంశమైంది.

హమ్మయ్య.. పులి క్షేమం

- రాంపూర్ బీట్‌లో సంచరిస్తున్నట్లు గుర్తింపు
- ఊపిరి పీల్చుకున్న అటవీ అధికారులు


పులి పాదముద్రలు


అటవీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాలు

వేమనపల్లి: వారం రోజులుగా జాడలేని కే-12 పులి ఆచూకి ఎట్టకేలకు లభ్యమైంది. కొమురంభీం జిల్లా రెబ్బెన రేంజ్ పరిధిలోకి వచ్చే రాంపూర్ అటవీ బీట్, మొండిగుట్ట ప్రాంతంలో పులి క్షేమంగా ఉన్నట్లు అటవీ అధికారుల పరిశీలనలో తేలింది. ఏడాది కాలంలో ఈ పులి కొమురంభీం జిల్లా రాంపూర్, ఖర్జీ, గెర్రెల్లి, అడవుల నుంచి మంచిర్యాల జిల్లా కుశ్నపల్లి రేంజ్, ఒడ్డుగూడం, వేమనపల్లి సెక్షన్‌లతో పాటు నీల్వాయి, కోటపల్లి అటవీ రేంజ్ లో కలియతిరుగుతోంది. ఈ నెల 11వ తేదీన కల్మలపేట బీట్ పరిధిలో కేతన్‌పల్లికి చెందిన ఆయిలాల వెంకటి, కొత్తగూడంకు చెందిన జడగళ్ల శ్రీను ఎడ్లపై దాడికి పాల్పడింది. తీవ్ర గాయాలతో ఎద్దులు బయటపడ్డాయి. అక్కడి నుంచి వెళ్లిన పులి వారం రోజులు కోటపల్లి అటవీ రేంజ్‌లలో సంచరించి కుశ్నపల్లి రేంజ్ లింగాల అటవీ సెక్షన్ లోతొర్రె సమీప అటవీ ప్రాంతం నుంచి పక్కనే ఉన్న కొమురంభీం జిల్లా అడవుల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. అప్పటి నుంచి పులి జాడ కానరాలేదు.

ఊపిరిపీల్చుకున్న అధికారులు..

వారం రోజులుగా జాడలేని పులి రాంపూర్ బీట్‌లో ప్రత్యక్షమవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అదృశ్యమైన వారం రోజులు పులి కదలికలు లభ్యం కాకపోవడంతో ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందిని పరుగులు పెట్టించారు. పులి ఎటు వెళ్లింది? ఎక్కడ మకాం పెట్టింది? అనే వివరాలు తెలుసుకునేందుకు అధికారులు హైరానా పడ్డారు. మూడు రేంజ్ పరిధిల్లో సుమారు 48 సీసీ కెమెరాలతో పులి జాడ కోసం పర్యవేక్షణ చేశారు. ఎనిమల్ ట్రాకర్స్, బేస్‌క్యాంప్ సిబ్బంది, ట్రైకింగ్ ఫోర్స్, స్థానిక అటవీ సిబ్బంది అడవులను జల్లెడ పట్టారు. రాంపూర్ బీట్‌లో పశువును హతమార్చిన పులి మాంసం భుజించి దట్టమైన అటవీ ప్రాంతంలోనే మకాం పెట్టింది. దీంతో ఆలస్యంగాఆచూకి లభ్యమైంది.

ఉచ్చులతో ముప్పు..

ఇటీవల కొందరు వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు , ఉచ్చులు అమర్చి వేటాడుతుండటంతో పులికి ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉంది. ఇటీవల నీల్వాయి రేంజ్ కల్మలపేట బీట్‌లో విద్యుత్ తీగలు అమర్చి అడవి పందులను హతమార్చిన నలుగురు వ్యక్తులపై అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. గతంలో కోటపల్లి మండలం పిన్నారం, బెల్లంపల్లి మండలం గురిజాల, జైపూర్ మండలం శివ్వారం అటవీ ప్రాంతాల్లో మూడు పులులు వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి మృతి చెందిన సంఘటనలున్నాయి. అంతేకాకుండా కొన్ని అటవీ శివారు గ్రామాల వెంట విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చి నిరాటంకంగా వన్యప్రాణులను హతమార్చుతున్నారు. దీంతో పులులకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం లేకపోలేదు.